# ఎన్నికల ప్రశాంతతకు..
# 24 గంటల నిఘా

**ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్**

సిటీబ్యూరో, నవంబరు 4(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు నిఘా బృందాలు పనిచేస్తున్నాయని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్ అన్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జిల్లాకు వచ్చిన ఎన్నికల వ్యయ పరిశీలకులు ఆయా శాఖలకు నియమించిన నోడల్ అధికారులు, ఎన్నికల నోడల్ అధికారులు, ఎన్నికల వ్యయ పరిశీలకులకు రొనాల్డ్ రోస్ వివరించారు. అక్రమ మద్యం, నగదు, బంగారం ఎన్నికల ప్రభావాన్ని తగ్గించేందుకు సర్వేలెన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు, ఒక్కో నియోజకవర్గానికి మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు ఏర్పాటు చేసి మొత్తం 45 టీమ్‌లు 24 గంటల పాటు ఎన్నికల నోటిఫికేషన్ నుంచి పనిచేస్తున్నాయని చెప్పారు. ఇప్పటి వరకు జరిగిన తనిఖీల్లో నగదు, ఆభరణాలు రూ.3.45 కోట్లు సీజ్ చేశారని రొనాల్డ్ రోస్ వివరించారు. ఈ సందర్భంగా ఎన్నికల వ్యయ పరిశీలకులు, ఎంసీఎంసీ కంట్రోల్, ఎన్నికల హెల్ప్‌లైన్ 1950 కంట్రోల్ రూంలను జిల్లా ఎన్నికల అధికారితో పాటు వ్యయ పరిశీలకులు పరిశీలించారు. ఈ నేపథ్యంలో సీజ్ చేసిన మొత్తాన్ని పార్టీలకు గాని, అభ్యర్థికి గాని సంబంధం కానిది ఎప్పటికప్పుడు ప్రజలకు ఇచ్చేందుకు అడిషనల్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లా ఫిర్యాదు కమిటీ విచారణ చేసి విడుదల చేస్తున్నామని రొనాల్డ్ రోస్ వివరించారు. ఈ సమావేశంలో ఆయా నియోజకవర్గాలకు చెందిన వ్యయ పరిశీలకులు, నోడల్ అధికారులు, సీపీ సందీప్ శాండిల్య, అదనపు సీపీ విక్రమ్ సింగ్ మాన్, జిల్లా కలెక్టర్, డిప్యూటీ డీఈఓ అనుదీప్ దురిశెట్టి, అడిషనల్ కమిషనర్ శంకరయ్య, అదనపు కలెక్టర్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న రొనాల్డ్ రోస్

## ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలి

*'మేడ్చల్' జిల్లా వ్యయ పరిశీలకులు ప్రేమ్ ప్రకాష్, బాలా సాహెబ్ బాపూరావు*




సమావేశంలో మాట్లాడుతున్న మేడ్చల్ జిల్లా వ్యయ పరిశీలకులు ప్రేమ్ ప్రకాష్, బాలా సాహెబ్ బాపూరావు

మేడ్చల్ కలెక్టరేట్, నవంబర్ 4: ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా వ్యయ పరిశీలకులు ప్రేమ్ ప్రకాష్, బాలా సాహెబ్ బాపూరావు అన్నారు. శాసనసభ ఎన్నికల నేపథ్యంలో శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నోడల్ అధికారులు, సహాయ వ్యయ పరిశీలకులు, తదితర బృందాలు, ఎన్నికల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నికల సంబంధించిన ఆయా అంశాలపై సమావేశం నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీవో శ్రీనివాస్ మూర్తి, డీటీవో నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు వీరే..

సిటీబ్యూరో, నవంబరు 4(నమస్తే తెలంగాణ): భారత ఎన్నికల సంఘం హైదరాబాద్ జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాలకు వ్యయ పరిశీలకులను నియమించిందని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్ తెలిపారు. కేంద్ర ఎన్నికల కమిషన్ వివిధ రాష్ర్టాలలో పనిచేస్తున్న ఐఆర్ఎస్ అధికారులను నియమించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ నియమించిన వ్యయ పరిశీలకులు వారికి కేటాయించిన నియోజకవర్గంలో పర్యటిస్తూ ఆర్ఓతో నోడల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించారు. వీరితో జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రోస్ శనివారం సమావేశం ఏర్పాటు చేసి జిల్లాలో ఎన్నిక ఏర్పాట్లపై వివరించారు. జిల్లాలో చేసిన ఏర్పాట్లపై ఈ సందర్భంగా వారు సంతృప్తి వ్యక్తం చేశారు.

**నియోజకవర్గాలు - వ్యవ పరిశీలకుల వివరాలు**

| నియోజకవర్గం | వ్యయ పరిశీలకులు | ఫోన్ నంబరు |
|---|---|---|
| ముషీరాబాద్-నాంపల్లి | సుబోధ్ సింగ్ | 8125972750 |
| మలక్‌పేట-అంబర్‌పేట్ | లక్ష్మీకాంత దాసప్ప | 8125972725 |
| ఖైరతాబాద్ | మహేష్ జ జవాడి | 8125972708 |
| జూబ్లీహిల్స్-సనత్‌నగర్ | డా.మీతు అగర్వాల్ | 8215972707 |
| కార్వాన్-గోషామహల్ | ధనంజయ్ సింగ్ | 8125972653 |
| చార్మినార్-చాంద్రాయణగుట్ట | మృణాల్ కుమార్ దాస్ | 8125972566 |
| యాకుత్‌పుర-బహదూర్‌పుర | అర్జున్ మాణిక్ | 8125972561 |
| సికింద్రాబాద్- కంటోన్మెంట్ | జస్టిన్ వేద ముత్తు | 8125972494 |
| మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్ | ప్రేమకాశీ మీనా | 7337047773 |
| కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి | సాహెబ్ బాపూరావు | 7337047774 |

## శిక్షణకు హాజరు కాని అధికారులు, సిబ్బందిపై చర్యలు

మేడ్చల్ కలెక్టరేట్, నవంబర్ 4: ఎన్నికల శిక్షణ తరగతులకు హాజరు కాని అధికారులు, సిబ్బందిపై చర్యలు మేడ్చల్-మల్కాజిగిరి ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అన్నారు. కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలకు సంబంధించి శిక్షణకు హాజరు కాని అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని, శిక్షణకు విధిగా హాజరుకావాలన్నారు.

## కేసీఆర్ ఆధ్వర్యంలోనే బడుగులకు మేలు: వలిగొండ శ్రీనివాస్

హిమాయత్‌నగర్, నవంబర్ 4: రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాలకు సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఎంతో మేలు జరుగుతున్నందున బీఆర్ఎస్ పార్టీకే మద్దతు ఇస్తున్నట్లు తెలంగాణ దళిత బహుజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వలిగొండ శ్రీనివాస్ తెలిపారు. హైదర్‌గూడలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాజకీయ పార్టీలకు అతీతంగా దళిత బంధు పథకాన్ని అమలు చేసి దళితుల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత దేశంలోనే గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్ అని తెలిపారు. బంగారు తెలంగాణ నిర్మాణంలో బీఆర్ఎస్‌కు ప్రజలు అండగా నిలబడి పార్టీ అభ్యర్థులందరినీ గెలిపించాలని బహుజనులకు పిలుపు నిచ్చారు.

## జీహెచ్ఎంసీలో నామినేషన్ల సందడి

*రెండో రోజు 14 నామినేషన్లు దాఖలు*

సిటీబ్యూరో, నవంబరు 4(నమస్తే తెలంగాణ): రాష్ట్ర శాసనసభకు జరిగే ఎన్నికలకు గానూ హైదరాబాద్ జిల్లాలో రెండో రోజు శనివారం 11 మంది అభ్యర్థులు 14 సెట్లు దరఖాస్తులు దాఖలు చేశారు. రెండు రోజుల వ్యవధిలో 20 మంది నామినేషన్లు దాఖలయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్ తెలిపారు. ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి ధర్మ సమాజ్ పార్టీ నుంచి ముత్యాల రాజేష్, మలక్‌పేట నియోజకవర్గం నుంచి రెండు నామినేషన్లు ఇండిపెండెంట్ అభ్యర్థిగా సయ్యద్ బిలాల్, బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నుంచి అల్లోల రమేష్‌లు నామినేషన్లు దాఖలు చేశారు. అంబర్‌పేట నుండి ఇండిపెండెంట్ అభ్యర్థిగా దేవరుప్పల శ్రీకాంత్ , ఖైరతాబాద్ నియోజకవర్గం నుండి ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి మహ్మద్ మాజిద్ నామినేషన్ దాఖలు చేశారు. జూబ్లీహిల్స్ నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా సుదిరెడ్డి శివశంకర్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. నాంపల్లిలో బీఆర్ఎస్ నుంచి హెచ్ సంతోష్ కుమార్ నాలుగు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. గోషామహల్ నియోజకవర్గంలో బీజేపీ నుంచి టి.రాజాసింగ్ నామినేషన్ దాఖలు చేశారు. యాకుత్‌పుర నుంచి రెండు నామినేషన్లు దాఖలు చేయగా, అందులో ఇండిపెండెంట్ అభ్యర్థి మహమ్మద్ అక్రం అలీఖాన్, ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఏ.సరిత నామినేషన్ వేశారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో శ్రమజీవి పార్టీ నుంచి జాజుల భాస్కర్ నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు సంబంధిత రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో అభ్యర్థులు దాఖలు చేయాల్సి ఉంటుందని ఎన్నికల అధికారి రొనాల్డ్ రోస్ చెప్పారు.

**మేడ్చల్‌లో రెండో రోజు 6 నామినేషన్లు**

మేడ్చల్, నవంబర్ 4(నమస్తే తెలంగాణ): శాసనసభ ఎన్నికలకు సంబంధించి మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా రెండో రోజు 6 నామినేషన్లు దాఖలు అయినట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ వెల్లడించారు. రెండో రోజైన శనివారం నామినేషన్లకు సంబంధించి మేడ్చల్ నియోజకవర్గంలో 2, మల్కాజిగిరి, కూకట్‌పల్లి నియోజకవర్గంలో 1, ఉప్పల్ నియోజకవర్గంలో 3 నామినేషన్లు దాఖలు అయినట్లు తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి ఒక్క నామినేషన్ దాఖలు కాలేదన్నారు. రెండు రోజుల్లో 12 నామినేషన్లు దాఖలు అయినట్లు పేర్కొన్నారు. నామినేషన్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అవసరమైన బందోబస్తును పోలీసులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

## కాంగ్రెస్, బీజేపీలకు ఓట్లెయ్యం

- గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపింది.. కేసీఆర్
- బీఆర్ఎస్‌కే గిరిజనుల మద్దతు
- గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకట్ బంజారా



సమావేశంలో అభివాదం చేస్తున్న వెంకట్ బంజారా, ఇందల్ రాథోడ్, శ్రీను నాయక్, లోకేష్ నాయక్ తదితరులు

ఖైరతాబాద్, నవంబర్ 4: 'యాభయ్యేండ్లలో కాంగ్రెస్ పార్టీ గిరిజనులకు చేసిందేమి లేదు. పైగా ఆదివాసీలు, గిరిజనులకు మధ్య చిచ్చుపెట్టి దుష్ట రాజకీయాలకు పాల్పడుతున్నది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి గిరిజనుల సంక్షేమమే పట్టదు. ఈ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు ఓట్లేసేది లేదు' అని గిరిజన విద్యార్థి సంఘం, విద్యార్థి సంఘం నేతలు స్పష్టం చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో తమ సంపూర్ణ మద్దతు బీఆర్ఎస్ ఉంటుందని ప్రకటించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకట్ బంజారా మాట్లాడుతూ, ముఖ్యమంత్రిగా కేసీఆర్ బాధ్యతలు తీసుకున్న తర్వాత గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. గడిచిన పదేండ్లలో గిరిజనుల సంక్షేమానికి ఎనలేని కృషి చేశారన్నారు. ప్రధానంగా గిరిజనుల చిరకాల కోర్కె అయిన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి సీఎం కేసీఆర్ మాట నిలబెట్టుకున్నారన్నారు. కేవలం ఆరు శాతం ఉన్న గిరిజన రిజర్వేషన్లు పది శాతానికి పెంచారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల్లో పదవుల కోసం కొట్లాటలు తప్ప గిరిజనుల గోడు ఎన్నడూ పట్టించుకోలేదన్నారు. తాజాగా టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి వెయ్యి రూపాయలు, మందు బాటిల్ ఇస్తే ఓట్లు వేస్తారంటూ వ్యాఖ్యానించడం ఆయన అగ్రవర్ణ అహంకారానికి నిదర్శనమన్నారు. టికెట్ల విషయంలోనూ ఆదివాసీల ప్రాబల్యం ఉన్న చోట గిరిజనులకు, ఆ వర్గాలు అధికంగా ఉన్న చోట ఆదివాసీలకు టికెట్లు ఇచ్చి తమలో తమకు పంచాయతీలు పెట్టే కుట్ర చేశారన్నారు. ఈ ఎన్నికల్లో ఒక్క గిరిజనుడి ఓటు కూడా కాంగ్రెస్‌కు పడదన్నారు. ఢిల్లీ ప్రభుత్వాల వల్ల గిరిజనులకు ఒరిగేదేమీ ఉండదని, న్యాయం జరుగదని, బీఆర్ఎస్‌తోనే తమ జాతి అభివృద్ధి జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పాలనలో గిరిజనుల భూములను దాడులు, దౌర్జన్యాలతో గుంజుకుంటే, కాని రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా ముఖ్యమంత్రి కేసీఆర్ పోడు భూముల హక్కు పత్రాలు అందజేసి తమ గుండెల్లో నిలిచిపోయారన్నారు. మరో సారి బీఆర్ఎస్‌ను గెలిపించుకోవడం ద్వారా మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతుగా సోషల్ మీడియాతో పాటు ప్రతి తండా, గూడెలు, గ్రామాలలో తిరిగి ప్రచారం చేస్తామని, రాష్ట్రంలోని గిరిజనులంతా బీఆర్ఎస్‌కే ఓట్లు వేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో గిరిజన విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు ఇందల్ రాథోడ్, ప్రధాన కార్యదర్శి రోహిత్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేష్ నాయక్, ఉపాధ్యక్షులు శ్రీను నాయక్ పాల్గొన్నారు.